సాక్షి
అనంతపురం
గురువారం । 27 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



మరింత పెరిగిన టమాట ధర

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.132 పలికింది. కనిష్టం రూ.100, సరాసరి రూ.120 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
28.9°/21.3°

జిల్లా అంతటా బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై జిల్లా అంతటా జడివాన కురిసింది.

నాసిరకం నారుకు చెక్

- పకడ్బందీగా విత్తన చట్టం అమలు
- నర్సరీల్లో నాణ్యత లేని నారు విక్రయాలపై ఉక్కుపాదం
- రైతుకు నష్టం రాకుండా జగన్ సర్కారు పటిష్ట చర్యలు



నర్సరీలో పెరుగుతున్న మిరప నారు

రాయదుర్గం: రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. నష్టాలు నివారించి వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా నర్సరీల్లో నాసిరకం నార్ల విక్రయానికి అడ్డుకట్ట వేసింది. విత్తన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ఎక్కడైనా నాణ్యతలేని నారు విక్రయిస్తే నర్సరీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 423 నర్సరీలు నెలకొల్పగా.. అందులో 352 రిజిస్ట్రేషన్ అయ్యాయి. 335 నర్సరీలు లైసెన్సు కలిగి ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో మిరప నారుకు డిమాండ్ పెరిగింది. ఈ పంట సాగంటే రైతుకు కత్తిమీద సాములాంటిది. విత్తనం కొనుగోలులో ఏ చిన్న పొరపాటు జరిగినా నష్టం పూడ్చలేని స్థాయిలో ఉంటుంది. ఇతర వాణిజ్య, ఉద్యాన పంటలతో పోల్చితే నష్ట తీవ్రత ఎక్కువే. ప్రధానంగా నారు కొనుగోలు సమయంలో ఏమాత్రం మోసపోయినా రైతు నట్టేట మునిగినట్టే. పైరు ఏపుగా పెరిగినట్టు కనిపించినా, దిగుబడి మాత్రం కొంప ముంచక తప్పదు. మిర్చితో పాటు టమాట, బెండ, వంకాయ తదితర పంటల నార్ల విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఈ నష్టం నుంచి రైతును గట్టెక్కించేందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'విత్తన చట్టం' అమలుకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో వెళ్లి నర్సరీల్లో నకిలీ నారుకు అడ్డుకట్ట వేసేలా కీలక చర్యలు చేపట్టారు. తనిఖీల సమయాన విత్తనం, నారు పెంపకం తదితర విషయాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీస్తారు.

గతంలో నర్సరీల నిర్వహణ ఇలా..

నర్సరీల నిర్వహణపై ఉద్యాన శాఖ అధికారులు మాత్రమే పర్యవేక్షణ చేసేవారు. నర్సరీ నిర్వాహకులకు లైసెన్సు ఇచ్చి నిబంధనలకు అనుగుణంగా షేడ్‌నెట్ నిర్వహణ చేసేలా చర్యలు చేపట్టే వారు. విత్తనాలు, మొక్క నాణ్యత వంటి విషయాలపై పెద్దగా పరిశీలన ఉండేది కాదు.

విత్తన చట్టం అమలు ఇలా..

నర్సరీ నిర్వాహకులు విత్తన కంపెనీ, రకాలు, జీఓటీ, ఎక్కడ కొనుగోలు చేశారనే వివరాలు.. రికార్డుల్లో పొందుపర్చాలి. నర్సరీ బెడ్లపై కచ్చితంగా విత్తనం ప్యాకెట్లు, వివరాలు ఉంచాలి. మొక్క తయారైన తర్వాత విక్రయించే సమయాన రైతుకు రసీదులు అందజేయాలి. సాగు చేసిన తర్వాత తేడా కనిపిస్తే రైతులు అధికారులకు ఫిర్యాదులు చేయొచ్చు. నర్సరీల్లో కొత్తగా 12 అంశాలతో కూడిన నిబంధనలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులు తరచూ నర్సరీలు తనిఖీలు చేస్తూ అక్రమాల కట్టడికి చర్యలు చేపడతారు.

నిబంధనల మేరకే నిర్వహణ



ప్రభుత్వ నిబంధనల మేరకే నర్సరీ నిర్వహణ చేపట్టాం. నారు కొనుగోలు చేసే రైతులకు తప్పకుండా రసీదులు అందిస్తున్నాం. నూతన చట్టంపై అధికారులు అవగాహన కల్పించారు. 12 అంశాలతో కూడిన నిబంధనలు పాటించేలా ఉత్తర్వులు జారీ చేశారు. డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాం. నాసిరకం కాకుండా నాణ్యతకే పెద్దపీట వేస్తున్నాం. రసీదు ఇవ్వడంతో మాపై కూడా బాధ్యత పెరిగినట్టవుతుంది.

– బాబు, నర్సరీ నిర్వాహకుడు, రాయదుర్గం

ఇక నాణ్యమైన నారు దక్కుతుంది



నేను ఏటా 10 నుంచి 15 ఎకరాల్లో మిరప పంట సాగుచేస్తాను. గతంలో విత్తన చట్టం అమల్లో లేకపోవడంతో నర్సరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విత్తన చట్టం వల్ల నర్సరీల్లో రైతులకు నాణ్యమైన నారు దక్కనుంది. రసీదు కూడా ఇవ్వడంతో యజమానులు బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువ మంది రైతులు విత్తనాలు తీసుకెళ్లి నర్సరీల్లో పెంపకం చేపట్టేందుకు అలవాటు పడుతున్నారు.

– మంజునాథరెడ్డి, రైతు, రంగసముద్రం

రసీదులు పొందాలి



రైతులు నర్సరీల్లో ఏరకం నారు కొనుగోలు చేసినా రసీదులు పొందాలి. విత్తన కంపెనీ, దాని లాట్ నంబర్ వంటి వివరాలు అడిగి రసీదులో పొందుపరిచేలా చూసుకోవాలి. ఇవేవీ లేకుండా కొనుగోలు చేస్తే నష్టం జరిగిన తర్వాత ప్రశ్నించే హక్కు కోల్పోతాం. కొత్తగా ఏర్పటయ్యే నర్సరీలు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ లేని నర్సరీల్లో రైతులు నారు కొనుగోలు చేయవద్దు. చిరునామా లేని అపరిచిత వ్యక్తులు, సరైన నిర్వహణ లేని నర్సరీల నుంచి మొక్కలు కొనుగోలు చేయకూడదు. సొంతంగా దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి విత్తనం నాటించి నారు పెంచుకోవడం ఉత్తమం.

– బి.రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

న్యూస్‌రీల్

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



ఉరవకొండ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఉరవకొండ: మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన ఉరవకొండ అర్బన్, రూరల్ పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో మొహర్రం వేడుకలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎక్కడా అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు మొహర్రం వేడుకలు జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప, ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్, రూరల్ సీఐ శేఖర్ పాల్గొన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్



రాప్తాడురూరల్: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతి ప్రవేశాలకు, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్ చేరేందుకు అర్హులని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'డ్రైల్యాండ్ హార్టికల్చర్' వేగవంతం చేయండి



అనంతపురం టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులను వేగవంతం చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం ఏపీడీలు, ఏపీఓలతో ఆయన టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ఆరు వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 5వేల ఎకరాలకు అనుమతులు సైతం మంజూరయ్యాయన్నారు. మరో వెయ్యి ఎకరాలకు రెండు రోజుల్లో అనుమతులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు అర్హత సాధించిన లబ్ధిదారుల పొలాల్లో గుంతలు తవ్వే కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి 4వేల ఎకరాల్లో పనులు చేపడుతున్నారన్నారు. ఆగస్టు మొదటి వారంలోగా గుంతలు తవ్వకం 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు చివరి కల్లా మొక్కలు గ్రౌండింగ్ అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. రైతులకు కావాల్సిన మొక్కలను నర్సరీల నుంచి సరఫరా చేయాలన్నారు. పండ్ల మొక్కలను రైతులే కొనుగోలు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కూలీల బిల్లులు సైతం ఎప్పటికప్పుడు నూతన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ



అనంతపురం టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు 'డయల్ యువర్ విద్యుత్ శాఖ ఎస్ఈ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఈ సురేంద్ర తెలిపారు. వినియోగదారులు 08554–272943 నంబరుకు డయల్ చేసి విద్యుత్ సమస్యలను తెలిపితే పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీకేఎస్‌లో భారీ వర్షం

- జిల్లా అంతటా జడివాన



అనంతపురం అగ్రికల్చర్: బుక్కరాయసముద్రంలో బుధవారం భారీ వర్షం కురిసింది. జిల్లా అంతటా జడితో కూడిన మోస్తారు వర్షపాతం నమోదైంది. బీకేఎస్‌లో 50మి.మీ, విడపనకల్లు 30, బెళుగుప్ప 28, బొమ్మనహాళ్ 26, ఉరవకొండ 25, గార్లదిన్నె, గుత్తి 23, కణేకల్లు, రాప్తాడు, అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, పామిడి, పెద్దవడుగూరు, శింగనమల, పుట్లూరు, ఆత్మకూరు తదితర మండలాల్లో 20 మి.మీపై బడి వర్షపాతం నమోదైంది. మిగతా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఈ ఒక్కరోజే 15 మి.మీకు పైగా సగటు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా రాగల మూడు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

అనంతపురం అర్బన్: జిల్లాకు భారీ వర్షసూచన ఉన్నందున అన్ని శాఖలూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. వర్షాలపై కలెక్టర్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలు కురిస్తే చెరువులకు గండ్లు పడే అవకాశం ఉంటుందన్నారు. కట్ట బలహీనంగా ఉండే చెరువులు, రిజర్వాయర్ల వద్ద అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నెర్రెక్కిన పాత ఇళ్లు భారీ వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాంటి ఇళ్లలో ఉండేవారు సురక్షిత భవనాల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు కురిస్తే వాగులు, వంకలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి ఉంచి, అవసరమైన చర్యలు చేపట్టేందుకు ముందుస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా జాగ్రతగా ఉండాలన్నారు.

మొదటి వారం వరకు వేరుశనగకు అవకాశం



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కణేకల్లు: ఆగస్టు మొదటి వారం వరకు వేరుశనగ విత్తనాలు విత్తుకోవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. కణేకల్లు వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2.30లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 38వేల హెక్టార్లలో సాగయ్యిందన్నారు. రైతులకు సబ్సిడీ కింద 74,600 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను అందజేసినట్లు చెప్పారు. ఆగస్టు మొదటి వారానికి వేరుశనగ సాగుపై ఒక స్పష్టత వస్తుందన్నారు. అనంతరం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం పెసలు, కొర్ర, ఉలవలు, అలసందులు, జొన్న విత్తనాలిచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కణేకల్లు అగ్రికల్చర్ ఫాంలో సాగు చేసిన వరినారును డీఏఓ పరిశీలించారు.

ఈ క్రాప్ బుకింగ్ పక్కాగా చేయండి

ఖరీఫ్‌లో ఈ క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలని డీఏఓ ఉమమహేశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. జియో ఫెన్సింగ్ బేస్ చేసుకొని సంబంధిత సర్వే నంబర్‌లో సాగు చేసిన పొలంలోనే రైతు ఫొటోలు తీసుకోవాలన్నారు. కణేకల్లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం రాయదుర్గం డివిజన్‌స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓలు శ్రవణ్‌కుమార్, అహమ్మద్‌బాషా, నిర్మల్‌కుమార్, సాయికుమార్ హాజరయ్యారు. ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియ గురించి ఏఓ, ఆర్బీకే సిబ్బందికి డీఏఓ వివరించారు. ఇన్సూరెన్స్, నాన్ ఇన్సూరెన్స్ పంటల గురించి రైతులకు వివరించాలని ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

నేడు 'విదేశీ విద్యా దీవెన' నగదు జమ



అనంతపురం రూరల్: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి సంబంధించిన నగదు గురువారం విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. జిల్లాలో ఐదుగురు విద్యార్థులకు ఈ పథకం కింద మొదటి, రెండో విడత కళాశాలల ఫీజులకు సంబంధించి రూ.71, 29,000 మంజూరైంది. విదేశీ విద్యా దీవెన నగదు జమ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ తెలిపారు.

నేడు ఖాతాల్లోకి పీఎం కిసాన్ నగదు

- 2.87 లక్షల మంది రైతులకు రూ.57.50 కోట్లు



అనంతపురం అగ్రికల్చర్: 'వైఎస్సార్ రైతు భరోసాలో భాగంగా పీఎం కిసాన్ కింద మొదటి విడతగా రూ.2 వేల ప్రకారం పెట్టుబడి సాయం గురువారం రైతుల ఖాతాల్లోకి జమ కానుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ పథకం కింద ఏటా ప్రతి రైతు కుటుంబానికీ రూ.13,500 సాయం అందుతోంది. ఖరీఫ్ పెట్టుబడికి జూన్‌లో రూ.7500 ప్రకారం, రబీ పెట్టుబడికి అక్టోబర్‌లో రూ.4 వేలు, పంట నూర్పిడి సమయంలో సంక్రాంతి కానుకగా మూడో విడతగా రూ.2 వేలు ప్రకారం గత నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లోకి జమ అవుతోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500, కేంద్రం రూ.6 వేలు ఇస్తోంది. అయితే కౌలుదారులు, అటవీభూముల సాగుదారులకు పూర్తి మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఈ క్రమంలో ఐదో ఏడాదికి సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా కింద జూన్ ఒకటిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతుకూ రూ.5,500 ప్రకారం జమ చేశారు. 2.87 లక్షల మందికి పైగా రైతులకు రూ.159 కోట్లు ఇచ్చారు. అయితే ఈ–కేవైసీ తప్పనిసరి చేయడంతో పీఎం కిసాన్ కింద కేంద్రం వాటా రూ.2 వేలు కాస్త ఆలస్యమైంది. ఆ మొత్తాన్ని గురువారం విడుదల చేస్తున్నారు. పీఎం కిసాన్ కింద ఇపుడు 2.87 లక్షల మందికి పైగా రైతులకు రూ.57.50 కోట్ల వరకు పెట్టుబడిసాయం జమ కానుందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ పథకం కింద గత నాలుగేళ్లలో జిల్లా రైతులకు రూ.1,660 కోట్ల మేర ఇచ్చారు. ఇపుడు ఐదో ఏడాది కూడా దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు.



కుళ్లాయిస్వామి పీరు దర్శనం కోసం ఎదురు చూస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో కుళ్లాయిస్వామి

భక్తిశ్రద్ధలతో చిన్నసరిగెత్తు

నార్పల: గూగూడు ఉత్సవాల్లో బుధవారం కుళ్లాయి స్వామి చిన్నసరిగెత్తు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని అర్చకులు హుసేనప్ప ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు కుళ్లాయిస్వామి పీరుతో పాటు పక్కనే ఉన్న ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, ఈఓ శోభ, స్థానికులు లింగారెడ్డి, గోపాల్, శివయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రకు వరద వెల్లువ

- 1,13,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 44.19 టీఎంసీలు దాటిన నీటి నిల్వ
- హెచ్చెల్సీ నీటి విడుదలకు మార్గం సుగమం

అనంతపురం సెంట్రల్: ఆలస్యమైనా వర్షాలు ఆయకట్టు రైతులను గట్టెక్కించాయి. తుంగభద్ర జలాశయానికి కనీవినీ ఎరుగని రీతిలో వరద వస్తోంది. అత్యధికంగా 1,13,000 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో నమోదైంది. బుధవారం సాయంత్రానికి జలాశయ నీటిమట్టం 44.19 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర హైలెవల్ కెనాల్(హెచ్చెల్సీ)కి నీటిని విడుదల చేయడానికి బోర్డు సుముఖత వ్యక్తం చేసింది. ఈ ఏడాది దామాషా ప్రకారం 175 టీఎంసీలు తుంగభద్ర జలాశయానికి నీటి లభ్యత ఉంటుందని అంచనా వేశారు. దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 26.828 టీఎంసీల కేటాయింపులు చేశారు. వర్షాభావంతో తుంగభద్ర జలాశయం అడుగంటడడంతో నీటి కేటాయింపులు తగ్గవచ్చనే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే గత కొద్దిరోజులుగా కర్ణాటకలో విస్తారమైన వర్షాలు కురుస్తున్నాయి. దీని వల్ల రోజుల వ్యవధిలోనే జలాశయం సగం దాకా నిండింది. మరికొద్దిరోజులు ఇలానే వరద వస్తే పూర్తి స్థాయిలో నిండే అవకాశముంది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు ఈ నెల 28న తుంగభద్ర జలాశయం వద్ద హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. తొలుత రోజుకు 500 క్యూసెక్కులు చొప్పున నీటిని తీసుకుంటూ క్రమంగా పెంచుకోవాలని భావిస్తున్నారు. ఈ నెల 30 నాటికి జిల్లా సరిహద్దులోకి తుంగభద్ర జలాలు వస్తాయని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ 'సాక్షి'కి తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు ఆగిన ఇన్‌ఫ్లో

శ్రీశైలం జలాశయానికి బుధవారం ఇన్‌ఫ్లో ఆగిపోయింది. కొద్దిరోజులుగా జూరాల ప్రాజెక్టు నుంచి వరదనీటిని దిగువకు వదలడంలో కొంత వరకు శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పెరిగింది. అయితే బుధవారం జూరాల నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో శ్రీశైలానికి ఇన్‌ఫ్లో ఆగిపోయింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటి మట్టం 809 అడుగులకు చేరింది. 830 అడుగులకు చేరితేనే హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు లిఫ్టుల ద్వారా నీటిని తీసుకునే అవకాశముంటుంది. హంద్రీ–నీవాకు నీటి విడుదలకు మరికొద్దిరోజులు సమయం పట్టే అవకాశమున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.



నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

డ్రాపౌట్ పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం క్రైం: గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వేను పకడ్బందీగా నిర్వహించి డ్రాపౌట్ పిల్లలను పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని 40, 41 సచివాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం జీఈఆర్ సర్వేకు సంబంధించి విద్యా, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. సర్వే వంద శాతం చేపట్టి 5 నుంచి 18 ఏళ్ల లోపు డ్రాపౌట్స్ పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. చిన్నారులు ఎక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని ప్రతి రోజూ గుర్తించాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ఈ ప్రక్రియ పద్ధతి ప్రకారం నిర్వహించడానికి కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. బడి బయట ఎవరూ ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయాలన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి వ్యక్తిగత పరిశీలన చేయాలని, వంద శాతం పిల్లలు ఎన్‌రోల్‌మెంట్ అయ్యారో లేదో చూసుకోవాలన్నారు. ప్రధానంగా బాలికలు ఎట్టి పరిస్థితుల్లో డ్రాపౌట్స్ కాకుండా చూసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతోందని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, డీఈఓ సాయిరాం, ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, ఎంఈఓ వెంకటస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ –2024కు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ గౌతమి కోరారు. ఇంటింటి సర్వేను బూత్‌లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) పక్కాగా నిర్వహించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ బుధవారం తన చాంబర్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 19,39,163 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బీఎల్‌ఓలతో పాటు సర్వేలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొనాలని సూచించారు. ఇంటింటి సర్వేలో చేర్పులు, తొలగింపులపై రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు.

సర్వే తీరుపై కలెక్టర్ అగ్రహం

ఓటరు జాబితా సవరణ మందకొడిగా సాగుతోందంటూ కలెక్టర్ అగ్రహం వ్యక్తం చేశారు. బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టి నిర్దేశించిన తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆగస్టు ఒకటో తేదీ నుంచి 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలపవచ్చన్నారు.

క్లుప్తంగా

అటెండర్ ఆకస్మిక మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని మెప్మా విభాగంలో అటెండర్‌గా (ఔట్‌సోర్సింగ్) పనిచేస్తున్న దస్తగిరి(45) ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందాడు. బుధవారం ఉదయం విధులకు హాజరైన ఆయన కార్యాలయ సమీపంలోని ఓ కొట్టులో టీ తాగి వస్తుండగా కేఎస్ఆర్ స్కూల్‌కు ఆనుకుని గేటు వద్ద నేలకొరిగాడు. గమనించిన స్థానికులు ఆయనను పైకి లేపే లోపు నోటి నుంచి రక్తం కక్కుతూ ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, డీసీ సావిత్రి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఆర్ఓ సతీష్ తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై స్థానికులతో ఆరా తీశారు. మృతుడికి భార్య రమీజ, తల్లి ఖాసీంబీ, ఓ కుమార్తె ఉన్నారు. కాగా, అతని మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

నాణ్యమైన వైద్య సేవలందించండి


హాజరు పట్టీని పరిశీలిస్తున్న డాక్టర్ యుగంధర్

శింగనమల: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. శింగనమలలోని హెల్త్ క్లినిక్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫిర్దోస్, ఏఎన్ఎం శైలజ పాల్గొన్నారు.

కరువు సీమలో చదువుల సిరులు

రేపు ఎస్కేయూ ఆవిర్భావ దినోత్సవం
- హాజరు కానున్న ప్రముఖులు


శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం

అనంతపురం: కరువు సీమలో కల్పతరువుగా భాసిల్లుతున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఏర్పడి నేటితో 41 సంవత్సరాలు పూర్తయింది. 42వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న వర్సిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీంతో క్యాంపస్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

ఎస్కేయూ పీజీ అధ్యయన కేంద్రంతో మొదలై..
అనంతపురం కేంద్రంగా 1967లో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పీజీ సెంటర్‌గా ఏర్పాటై 1976లో అటానమస్ పీజీ సెంటర్‌గా గుర్తింపు దక్కించుకుంది. 1981లో ఎస్కేయూనివర్సిటీగా రూపాంతరం చెందింది. జ్ఞానం (విద్య), కర్మలు (పనులు) రెండింటినీ కలిపి తెలుసుకున్నవాడు కర్మల ద్వారా మరణాన్ని దాటి, జ్ఞానం ద్వారా అమరత్వాన్ని పొందుతాడనే ఈశావాస్యోపనిషత్తులో పేర్కొన్న 11వ శ్లోకం లోని ముక్తాయింపు 'విద్యయామృతశ్నుతే'ను జోడించి వర్సిటీ లోగోను రూపొందించారు. 487 ఎకరాల సువిశాలమైన క్యాంపస్‌తో 1988 నాటికి పూర్తిస్థాయి వర్సిటీగా గుర్తింపు దక్కించుకుంది. ప్రస్తుతం క్యాంపస్‌లో 4,312 మంది విద్యార్థులతో పాటు రెండు అటానమస్ కళాశాలలున్నాయి. 112 అనుబంధ డిగ్రీ కళాశాలల్లో లక్ష మంది విద్యార్థులు డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 76 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, 11 బీఈడీ కళాశాలలు, 1 బీపీఈడీ, 1 లా కళాశాల, 10 ఎంబీఏ /ఎంసీఏ కళాశాలలు, 17 పీజీ కళాశాలలు ఉన్నాయి. ఇప్పటి వరకూ 3,113 మంది డాక్టరేట్ అవార్డులు అందుకున్నారు. 8 వేల అంతర్జాతీయ జర్నల్స్ ముద్రించారు. రూ.50 కోట్ల విలువైన ఇస్రో, డీఎస్‌టీ, డీబీటీ, యూజీసీ, నీతి ఆయోగ్ ప్రాజెక్టులు నిర్వహించారు. బోటనీ, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ అండ్ పాలిమర్‌సైన్సెస్ విభాగాల్లో గణనీయమైన పరిశోధనలు జరిగాయి.

అంచలంచెలుగా అంతర్జాతీయ స్థాయికి..
వర్సిటీలో ఆర్ట్స్, సైన్స్ క్యాంపస్ కళాశాలలతో పాటు, ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఈడీ కళాశాలలున్నాయి. ఎస్కేయూ పీజీ సెంటర్‌గా ఉన్నప్పుడే ఇంగ్లిష్, తెలుగు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, జువాలజీ, కామర్స్, లా, ఎకనామిక్స్, రూరల్‌డెవలప్‌మెంట్ కోర్సులు నిర్వహించారు. 1981లో ఇన్‌స్ట్రుమెంటేషన్, పాలిమర్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, హిస్టరీ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చారు. 1982లో లైబ్రరీ సైన్సెస్, 1984లో పొలిటికల్ సైన్సెస్, జియాగ్రఫీ, 1985లో బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బోటనీ, సోషియాలజీ, అడల్ట్ ఎడ్యుకేషన్, 1986లో ఎంబీఏ, 1991లో ఎంపీఈడీ, 1994లో కంప్యూటర్ సైన్సెస్, 1998లో బయోటెక్నాలజీ, 2006లో ఇంజినీరింగ్ కళాశాల, 2007లో ఎడ్యుకేషన్ కళాశాల, 2008లో ఫార్మసీ కళాశాల, 2013లో హిందీ విభాగాలను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్‌లో 13 విభాగాల్లో 18 పీజీ కోర్సులు, సైన్సెస్‌లో 16 విభాగాల్లో 19 పీజీ కోర్సులు, ఇస్రో ప్రాజెక్ట్, బొటానికల్ గార్డెన్, సైన్సెస్‌లో విదేశాల్లో పీడీఎఫ్‌లు, పటిష్టమైన, నాణ్యమైన పరిశోధనలు, దక్షిణ భారతదేశంలోనే తొలి అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటుతో ఎస్కేయూ జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కించుకుంది. ఇస్రో ఆధ్వర్యంలో ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ఏర్పాటుతో అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి గుర్తింపు దక్కింది.

హాజరు కానున్న ప్రముఖులు..
ఈ నెల 28న నిర్వహించబోయే వర్సిటీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి, విశిష్ట అతిథులుగా యూపీఎస్‌సీ మాజీ సభ్యుడు డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి, ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ వి.పద్మనాభరెడ్డి, జేఎన్‌టీయూ(ఏ)వీసీ జింకా రంగజనార్దన, రాయలసీమ వర్సిటీ వీసీ ఎ.ఆనందరావు, యోగివేమన వర్సిటీ వీసీ సి.సుధాకర్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి హాజరుకానున్నారు. కార్యక్రమానికి ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్న స్పోర్ట్స్ డే కార్యక్రమానికి అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సాయంత్రం 5:30 గంటలకు ఆడిటోరియంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం : ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా స్వీకరించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నర్సరీ, పరిసర ప్రాంతాల్లో ఎస్పీ మొక్కలు నాటి, నీరు పోశారు. మొక్కలు చెట్లుగా విస్తరించే వరకూ కాపాడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, ఆర్ఎస్ఐ రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే 'జగనన్న గోరుముద్ద'

రాప్తాడు రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ మేరకే పాఠశాలల్లో 'జగనన్న గోరుముద్ద' కచ్చితంగా అమలు చేయాలని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి విద్యార్థీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా తీసుకునేలా చూడాలన్నారు. రాగి జావ, కోడిగుడ్డు, వేరుశనగ చిక్కీ తీసుకోవడం వల్ల ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం తదితర పోషకాలు పుష్కలంగా అందుతాయన్నారు. ఫలితంగా రక్తహీనతను అధిగమించే శక్తి పిల్లలకు చేకూరుతుందన్నారు.

జింక మృతి

మడకశిర రూరల్: మండలంలోని క్యాంపురం వద్ద పొలాల్లో ఓ జింక మృతి చెందింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు జింక కళేబరాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రెండు, మూడు జింకల పోట్లాడుకోవడంతో 14 నెలల వయసున్న ఓ ఆడ జింక మృతి చెందినట్లుగా అధికారులు నిర్ధారించారు. జింక కళేబరాన్ని మడకశిరలోని పశువైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అటవీ శాఖ కార్యాలయంలో దహనం చేశారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి


వికాస్ మృతదేహం

పెనుకొండ: శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమ నేషనల్ ఆటో ప్లాస్ట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వికాస్ (27) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఇతను కొంతకాలంగా పెనుకొండలోని ఆల్విన్ కాలనీలో సోదరుడు రాజు, మరి కొందరు కార్మికులతో కలసి అద్దె ఇంట్లో ఉంటూ నేషనల్ ఆటో ప్లాస్ట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తన గదిలో గొంతు కోసిన స్థితిలో పడి ఉన్నాడు. తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని తోటి కార్మికులు గమనించి.. చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు బెంగళూరుకు రెఫర్ చేశారు. ఈ మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది, తోటి కార్మికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

నైపర్ జేఈఈలో సత్తా చాటిన ఓటీపీఆర్ఐ విద్యార్థులు


కె.ప్రత్యూష


జి.శివరంజని


కె.జోషిత

అనంతపురం: ఫార్మా కోర్సుల్లో పీజీ ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్–2023 (నైపర్ జేఈఈ–2023)లో జేఎన్‌టీయూ(ఏ) ఓటీపీఆర్ఐ విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రతిభ చాటిన వారిలో 249వ ర్యాంక్‌తో కె.ప్రత్యూష, 795 ర్యాంక్‌తో జి.శివరంజని, 890 ర్యాంక్‌తో కె.జోషిత తొలి మూడు స్థానాలు దక్కించుకున్నారు. అలాగే జి.లింగేశ్వ (1,600), జి.సుకన్య (2,300), ఎన్.బ్లెస్సీ (2,997), ఎం.శిరీష (3,283), కె.శ్వేతాబాయి (3,647) ర్యాంకులు దక్కించుకున్నారు. దీంతో వీరు మొహాలీ, హైదరాబాద్, గౌహతి, కోల్‌కతా, రాయ్‌బరేలీ, హాజీపూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో పీజీ చేయడానికి మార్గం సుగమమైంది. ఫార్మాసుటిక్స్, ఫార్మాసూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ఫార్మాసుటికల్ అనాలసిస్, రెగ్యులేటరీ అఫైర్స్, క్లినికల్ రీసెర్చ్ తదితర విభాగాల్లో ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. జాతీయ స్థాయిలో గణనీయమైన ప్రతిభ చాటిన విద్యార్థులను ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ అభినందించారు.

కుక్కను కొట్టాడని వ్యక్తిపై దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కుక్కను కొట్టాడని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫస్ట్‌రోడ్డులో నివాసముంటున్న సురేష్ ఇంటికి బుధవారం ఆయన సోదరుడు వచ్చాడు. ఆ సమయంలో ఇంటి పక్కన నివాసముంటున్న వ్యక్తి పెంపుడు కుక్క ఆయనను కరిచింది. దీంతో ఆ కుక్కను బాధితుడు కొట్టాడు. ఈ విషయాన్ని గమనించిన కుక్క యజమాని అతనిపై దాడి చేశాడు. అడ్డుకోబోయిన సురేష్‌పై సైతం దాడికి ప్రయత్నించడంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చెలరేగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘటనపై ఇరు వర్గాలూ ఫిర్యాదు చేయడంతో చాలా సేపు మూడో పట్టణ పోలీసులు సర్దిచెప్పారు. అయినా కుక్క యజమాని తన పంథాను మార్చుకోకపోవడంతో చివరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుంతకల్లు: మండలంలోని నక్కనదొడ్డి వద్ద మంగళవారం అర్ధరాత్రి డీజిల్ ఆటోలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. బియ్యం తరలిస్తున్న గుత్తి మండలం పెద్దొడ్డి నివాసి చిరంజీవిని అరెస్ట్ చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

పెయ్య దూడలతోనే పాడిపరిశ్రమ అభివృద్ధి


చూడి పశువులను ప్రదర్శిస్తున్న పశు గణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్

రాప్తాడు: పెయ్య దూడలతోనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లిలో పెయ్య దూడల గర్భంతో ఉన్న చూడి ఆవుల ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. అత్యధిక పాడి సాధించడం ద్వారా రైతులు ఆర్థికంగా బలపడతారన్నారు. ఇందు కోసం కేవలం పెయ్య దూడలే జన్మించేలా ఆధునికత సాంకేతికతతో 23 ఆవులకు కృత్రిమ గర్భధారణ చేయగా... ఇందులో 15 ఆవులకు కట్టు నిలిచిందన్నారు. సబ్సిడీతో ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని పాడి రైతులు

సిలిండర్ పేలుడు ఘటనపై విచారణ


ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండా (రూపానాయక్ తండా)లో నివాసముంటున్న ఆర్‌వీ సరోజమ్మ ఇంట్లో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న వంట గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనపై తహసీల్దార్ అనిల్ కుమార్ విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ నేరుగా సరోజమ్మ ఇంటికి చేరుకున్నారు. పేలుడులో పూర్తిగా నేలమట్టమైన ఇంటిని పరిశీలించారు. నష్టం అంచనాలు రూపొందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచ్ శివాజీ నాయక్, ఉప సర్పంచ్ వెంకటేష్ నాయక్, మాజీ ఎంపీపీ కొర్రావెంకటమ్మ, మాజీ జెడ్పీటీసీ తులసీదాస్ నాయక్, సామా నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు మాట్లాడుతూ.. రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వివరించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. బాధితులకు తనవంతు సాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు... అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సెబ్ ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది బుధవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయంలో రాయదుర్గం మండలం గ్రామదట్ల వద్ద 576 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తూ కె.గంగాధర్ పట్టుబడ్డాడన్నారు. అలాగే గుమ్మఘట్ట సమీపంలో సెబ్ పోలీసులను చూడగానే ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని వదిలేసి పారిపోయాడన్నారు. పరిశీలించగా 192 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం బయటపడిందన్నారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సెబ్ పోలీసులు తెలిపారు.

సేవాభారతి అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: స్వాతంత్ర్యోద్యమ వేడుకలను పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో అందజేసే సేవా భారతి, తెలుగు తేజం జాతీయ అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఈఎస్ఎస్ నారాయణ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 13న హైదరాబాదులో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుంది. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారు అర్హులు. సంబంధిత వివరాలతో దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ సామాజిక సేవా సంస్థ, డోర్ నం.1-20-103, తిరుమలగిరి పోస్టు, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామాకు ఆగస్టు 5వ తేదీ లోపు అందేలా పంపాలి. పూర్తి వివరాలకు 96523 47207లో సంప్రదించవచ్చు.

సజావుగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన

అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో భర్తీ చేయనున్న 63 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాలోని అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ బుధవారం సజావుగా సాగింది. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో చేపట్టిన ఈ ప్రక్రియను డీఆర్వో గాయత్రీదేవి నేతృత్వంలో ఉభయ జిల్లాల కలెక్టరేట్ పరిపాలనాధికారులు శ్రీధర్, వెంకటనారాయణ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. మండలానికి ఓ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేట్ పోస్టు చొప్పున 63 మండలాలకు 63 పోస్టులకు 126 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. వీరందరికీ త్వరలో కంప్యూటర్ ప్రొఫెషనల్ టెస్ట్ (సీపీటీ) ఉంటుందన్నారు.

అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

- మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో రూ.3.39 కోట్ల పనులకు ఆమోదం
- తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు
- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి
- అధికారులకు మేయర్ వసీం ఆదేశం

అనంతపురం క్రైం: వర్షాకాలంలో తాగునీరు రంగు మారకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో రూ.3.39 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. అజెండాలోని 21 అంశాల్లో 9వ అంశాన్ని తాత్కాలికంగా ఆపాలని మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మేయర్ మాట్లాడుతూ.. కొన్ని కాలనీల్లో నీరు రంగు మారుతున్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అటువంటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ భాగ్యలక్ష్మిని ఆదేశించారు. అభివృద్ధి పనులు జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టు జాబితాలో ఉంచాలని సూచించారు. సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకూ మన ప్రభుత్వం, సీఎం స్పెషల్ నిధులతో జరుగుతున్న కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా దోమకాటు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీర్ల పర్యవేక్షణలో గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరిగేలా చూడాలన్నారు. ఇష్టారాజ్యంగా తవ్వడంతో రోడ్లు దెబ్బతినే పరిస్థితి నెలకొందని తెలిపారు. కుక్కల బెడదకు పరిష్కారం చూపాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. అనిమల్ బర్త్ కంట్రోల్ నుంచి అనుమతులు వచ్చే వరకూ ఎటువంటి చర్యలు తీసుకునే పరిస్థితి లేదన్నారు. కనీసం పిచ్చి కుక్కల బెడద లేకుండా చూడాలని కమిషనర్‌ను మేయర్ ఆదేశించారు.


మాట్లాడుతున్న మేయర్ వసీం

మేయర్‌కు సమాచారం ఇవ్వరా?

అజెండాలోని 9వ అంశానికి సంబంధించి దేశీయ మార్కెట్ ప్రోత్సహించడానికి ఫిష్ రీటైల్‌కు మూడు షాపుల కేటాయింపు అంశాన్ని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని మేయర్ వసీం అభ్యంతరం తెలిపారు. అందుకు సభ్యులు ఇస్పాక్ సైతం మేయర్, పాలకవర్గానికి తెలియకుండా ఇష్టానుసారంగా అంశాలను పొందుపర్చడం సరికాదన్నారు.

యూజర్ చార్జీలు వసూలు చేయాలి

నగరంలోని అన్ని డివిజన్లను సమానంగా చూడాలని, పారిశుధ్య కార్మికులను సమానంగా డివిజన్లకు కేటాయించాలని సభ్యులు ఇస్పాక్, శ్రీనివాసులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. క్లాప్ ఆటోల ద్వారా చేపడుతున్న చెత్త సేకరణకు సంబంధించి ప్రతి డివిజన్‌లో యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. కొన్ని డివిజన్లలో వసూలు చేసి మరికొన్ని డివిజన్లలో వదిలేయడం సరికాదన్నారు. ప్రతి డివిజన్‌లో యూజర్ చార్జీలు వసూలు చేస్తామని కమిషనర్ తెలిపారు. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ దారుణంగా ఉందని సభ్యులు టీవీ చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ మల, మూత్ర విసర్జనకు కేరాఫ్‌గా నిలుస్తోందన్నారు. కొత్తూరు మార్కెట్ నిర్వాహకులు రోడ్డుపై విక్రయాలు చేపడుతుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కమల్‌భూషణ్, సుమతి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, ఏసీపీ బాలాజీ, ఆర్ఓలు సతీష్, సుజాత పాల్గొన్నారు.

అభివృద్ధి అంశాలు ఇవే

30వ డివిజన్‌లో రూ.22.50 లక్షలతో సీసీ రోడ్డు, 20వ డివిజన్‌లో రూ.11.30 లక్షలతో రోడ్డు, బాక్స్ కల్వర్టు, 14వ డివిజన్‌లో రూ.33 లక్షలతో సీసీ డ్రైన్, 2వ డివిజన్‌లో రూ.14.15 లక్షలతో సీసీ డ్రైన్, 48వ డివిజన్‌లో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, 3వ డివిజన్‌లో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, అదే డివిజన్‌లో రూ.51 లక్షలతో ప్రహరీ, 32వ డివిజన్‌లో రూ.18.50 లక్షలతో సీసీ డ్రైన్, అదే డివిజన్‌లో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు, 8వ డివిజన్‌లో రూ.25.5 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్, 38వ డివిజన్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అదే డివిజన్‌లో రూ.28 లక్షలతో స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్, 26వ డివిజన్‌లో రూ.15.70 లక్షలతో కాలువ, 16వ డివిజన్‌లో రూ.14.90 లక్షలతో ఫుట్‌పాత్, కొత్తూరు, పాతూరు మునిసిపల్ షాపింగ్స్‌లోని 43 షాపు రూముల రెన్యూవల్ తదితర అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు.

క్లుప్తంగా

పూజా సామగ్రి విక్రయ హక్కులకు వేలం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పూజా సామాగ్రి విక్రయ హక్కులకు వేలం పాట నిర్వహించారు. అనంతపురానికి చెందిన నాగేశయ్య, రామయ్య రూ.1.85 లక్షలకు విక్రయ హక్కులు దక్కించుకున్నట్లు దేవదాయ డివిజన్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29న 'ఇర్లచెంగి' కథా సంకలనం ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: సత్యసాయి మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఆచార్య దేవకీ శ్రీనివాస భవనంలో ఈనెల 29న ఉదయం 11 గంటలకు ఆచార్య మహాసముద్రం దేవకీ రచించిన ఇర్లచెంగి కథా సంకలనాన్ని డాక్టర్ అనంత మాలతి ఆవిష్కరించనున్నారు. అదేవిధంగా 'మనలో మనం' అనే పేరిట వినూత్నంగా నడుస్తున్న మహిళల సమూహం నుంచి రాసిన 'తొలి అడుగులు' కవితా సంకలనం ఆవిష్కరణ ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి చేతుల మీదుగా జరుగుతుంది. చిలకూరి దీవెన పుస్తక సమీక్ష చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

పరామర్శ


చెర్లోపల్లిలో నారపరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారప రెడ్డి తండ్రి గుండాల వెంకటరామిరెడ్డి (84) మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి వెంకటరామిరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని అధైర్య పడకూడదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రమేష్, సర్పంచ్ ఓబిరెడ్డి, నాయకులు రామకృష్ణా రెడ్డి, జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు చర్యలు


సూచనలిస్తున్న కుష్ట వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం క్రైం: గత నెలలో జిల్లాలో ఇంటింటా నిర్వహించిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు (లెప్రసీ కేసు డిటెక్షన్ కాంపెయిన్) కార్యక్రమం ద్వారా 73 మందికి కుష్టు సోకినట్లు నిర్ధారించినట్లు కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. బుధవారం ఆ విభాగం సిబ్బందితో డాక్టర్ అనుపమ జేమ్స్ సమావేశమయ్యారు. వివిధ పీహెచ్‌సీల పరిధిలో జరిగిన సర్వేలో ఏఎన్ఎంలు, ఆశాలు బాగా పని చేశారని తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులు భయపడాల్సిన పని లేదన్నారు. ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి బహుళ ఔషధ చికిత్సను మొదటుపెట్టామని వెల్లడించారు. సిబ్బంది సమష్టిగా పని చేసే వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అన్వర్‌బాషా, పారామెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారామెడికల్ అధికారి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కుపై కేంద్రం మోసం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



అనంతపురం అర్బన్: కడప ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం రాయలసీమ ప్రజలను మోసం చేయడమేనని సీపీఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ అంశంపై బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వ సంస్థలు స్థాపించాల్సి ఉందన్నారు. అయితే బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లగా వీటిని అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. రాయలసీమ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామని ఆ పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షురాలు ప్రకటించిన మూడు రోజులకే ఉక్కు పరిశ్రమ స్థాపించలేమని కేంద్ర ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. రైల్వే జోన్, రామాయపట్నం పోర్టు నిర్మాణం సాధ్యం కాదని చెప్పడమూ రాష్ట్రం విషయంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. అనంతపురంలో నిర్మించాల్సిన కేంద్రీయ విశ్వవిద్యాలయం నిధుల గురించి కేంద్ర మంత్రి కనీసం ప్రస్తావన చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై రాజకీయాలకు అతీతంగా రాయలసీమ ప్రజలు, మేధావులు, యువత పోరాడాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు


కనగానపల్లి: కొలువుదీరిన పీర్లు


ఆత్మకూరులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కనగానపల్లి: మండల కేంద్రంలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిన్న సరిగెత్తును ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చావిడిలో కొలువుదీరిన దస్తగిరి, కుల్లాయి, వన్నూరుస్వాములను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేశారు. భక్తులు పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకొన్నారు. నంద్యాల జిల్లా భక్తులు కన్నా లక్ష్మీనారాయణ, శివారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో బుధవారం భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు నిర్వహించారు. భక్తులు చక్కెర చదివింపులు చేయించారు. భక్తులు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పూలమాలలను తీసుకొచ్చి పీర్లకు వేశారు. చిన్న సరిగెత్తులో భాగంగా వన్నూరు స్వామి పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు. పీర్ల చావిడి నుంచి అంకాలమ్మ ఆలయం వరకూ.. అక్కడి నుంచి గ్రామంలో ఉన్న బొడ్రాయి వరకు గ్రామోత్సవం చేపట్టారు. 28వ తేదీన పెద్ద సరిగెత్తు , 29వ తేదీన జలధి కార్యక్రమం నిర్వహిస్తామని ముల్లా సాహెబ్‌లు తెలిపారు.

మొహర్రం ప్రశాంతంగా జరిగేలా చూడాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా చూడాలని డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. క్రైం రేటు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కష్టపడి బతకడం నేర్చుకోవాలని నగర డీఎస్పీ జి.ప్రసాద్‌రెడ్డి రౌడీషీటర్లకు సూచించారు. దందాలు, దౌర్జన్యాలు చేస్తామంటే చూస్తూ ఊరుకునేది హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రతి రౌడీషీటర్ స్టేషన్‌కు హాజరై సంతకాలు చేసి వెళ్లాలన్నారు. తప్పతాగి అల్లర్లు, గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా ఆరో రోడ్డుకు చెందిన రౌడీషీటర్ల ఆగడాలపై నిఘా పెంచాలని సీఐకి సూచించారు. గతంలో కిరాయి హత్యలకు పాల్పడిన వారున్నారని తెలిపారు.

మొహర్రంపై సమావేశం

మొహర్రం పండుగ సందర్భంగా బుధవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వివాదాలు జరిగితే కమిటీ సభ్యులే బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ధరణీ కిషోర్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సహజీవనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పెళ్లి కాలేదని ఓ మహిళను మోసగించి పది సంవత్సరాలు సహజీవనం చేసిన వ్యక్తిపై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. సీఐ శివరాముడు వివరాలు.. నగరంలోని ఓ కాలనీకి చెందిన జయమ్మ నర్స్‌గా పని చేస్తోంది. పదేళ్లగా విజయభాస్కర్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఇటీవల విజయభాస్కర్‌కు పెళ్లి అయిందనే విషయం తెలుసుకున్న జయమ్మ అతడి ఇంటికి వెళ్లింది. ఈ విషయాన్ని విజయభాస్కర్ భార్య సుజన్‌కు తెలిపింది. పెళ్లి కాలేదని చెప్పి మోసం చేశాడని పేర్కొంది. దీంతో భార్య జయమ్మను మందలించింది. మనస్థాపానికి గురైన జయమ్మ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పక్కాగా ఈ-క్రాప్ నమోదు

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: రైతులకూ అన్యాయం జరగకుండా ఈ సారి పక్కాగా ఈ-క్రాప్ నమోదు చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ, అనంతపురం సబ్ డివిజన్ ఏడీఏ ఎం.రవి ఆదేశించారు. బుధవారం స్థానిక కృషి భవన్‌లో ఈ-క్రాప్, పంటల బీమా, చిరుధాన్యాల సాగు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, ఆర్‌బీకేల పని తీరుపై ఆరు మండలాల ఏఓలు, ఏఈఓలు, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా ఈ-క్రాప్ యాప్ పనితీరు, సాంకేతిక సమస్యలు, పంట నమోదు చేయాల్సిన విధానంపై శిక్షణ ఇచ్చారు. వాస్తవంగా వేసిన పంట కాకుండా ఇతర పంటలు, లేదంటే ఇతరత్రా వివరాలు తప్పుగా నమోదు చేస్తే తనిఖీల సమయంలో శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడా ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రతి రైతు పొలాన్ని సందర్శించి పంట నమోదు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. దీని వల్ల రైతులకు ప్రభుత్వం నుంచి పలు ప్రయోజనాలు ఉన్నందున చాలా కీలకంగా పని చేయాలన్నారు. ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, పంట రుణాల మంజూరు, సున్నా వడ్డీ, ఎంఎస్‌పీ అమ్మకాలు తదితర వాటికి ఈ-క్రాప్ ప్రామాణికమన్నారు. గతంలో చేసిన పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. ప్రస్తుతానికి మండలాల వారీగా సాగైన ఖరీఫ్ పంటల విస్తీర్ణం, ఆగస్టు 5 నాటికి సాగయ్యే విస్తీర్ణం అంచనా మేరకు మిగతా విస్తీర్ణంలో చిరుధాన్యాలు, ప్రత్యామ్నాయ పంట ప్రణాళిక అమలు చేయాలన్నారు. అందుకోసం కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కౌలుదారులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలన్నారు. పంటల బీమా పరిహారం మంజూరులో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం, రాప్తాడు, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, కూడేరు, ఆత్మకూరు మండలాల ఏఓలు శశికళ, వెంకటేశ్వర ప్రసాద్, శ్యాంసుందర రెడ్డి, సోమశేఖర, విజయకుమార్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ చిత్రంలో ఏడీఏ ఎం.రవి

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించండి

రాప్తాడు: తప్పుల్లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై మండలంలోని ప్రసన్నాయపల్లి సచివాలయంలో బుధవారం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల జాబితాలతో ఆగస్టు 21 వరకూ బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ఓటర్ల పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నాయ? లేదా అని సరి చూసుకోవాలన్నారు. ఈ సర్వేలో ఎటువంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదని సూచించారు. సర్వే సమయంలో రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా ఉండి బీఎల్ఓలకు సహకరించాలన్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు ఆధారాలతో సహా ఆర్డీఓ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామన్నారు. ఒక చోట ఓటు హక్కు ఉంచి, మరో చోట తొలగిస్తామని చెప్పారు. మరణించిన వారి ఓట్లు, బోగస్ ఓట్లు తొలగిస్తామన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలు నియమించుకునే పోలింగ్ ఏజెంట్ల వివరాలను తక్షణమే ఆర్డీఓ కార్యాలయానికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఈడీటీ విజయ్ కుమార్, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహ

అమరవీరులకు ఘన నివాళి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక టవర్ క్లాక్ సమీపంలోని మారుతీ లాడ్జ్‌లోని మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో బుధవారం కార్గిల్ అమర వీరులకు అనంత మాజీ సైనికులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు పి.వి.రావు మాట్లాడుతూ.. భారత సైన్యం ఆపరేషన్ విజయ్ మిషన్ పేరుతో ప్రారంభించిన యుద్ధం రెండు నెలల పాటు మైనస్ డిగ్రీల చలిలో జరిగిందన్నారు. ఈ యుద్ధంలో భారత్‌కు చెందిన సైనికులు 527 మంది అమరులయ్యారన్నారు. పాకిస్తాన్ సైన్యంలో 1000 మందిని మట్టుపెట్టగలిగారన్నారు. చివరిగా జులై 26న భారత్‌లో అడుగు పెట్టిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పి కొట్టి మన భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ విజయానికి చిహ్నంగా కార్గిల్ విజయ దివాస్‌ను జరుపుకుంటున్నట్లు తెలిపారు. వీర జవానుల త్యాగాలను నేటి తరానికి వివరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

చెన్నేకొత్తపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని న్యామద్దల-2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన 500 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ గంగావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముట్టాలలో 'జగనన్న సురక్ష'

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరూ తప్పకహాజరు కావాలని సూచించారు.


మహిళకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ముక్తాపురంలో..

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించే సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరవుతారన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలన్నారు.

తప్పిన ప్రమాదం

గార్లదిన్నె: రాందాస్‌పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం లారీని కారు ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. అనంతపురం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు రాందాస్‌పేట వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ షడన్ బ్రేక్ వేయడంతో ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు.

ఎడ్యుకేషన్ కార్యదర్శుల బదిలీ

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎడ్యుకేషన్ కార్యదర్శులను విధులు సర్దుబాటులో భాగంగా ఇతర సచివాలయాలకు బదిలీ చేస్తూ కమిషనర్ భాగ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. 39వ సచివాలయ ఎడ్యుకేషన్ కార్యదర్శి బీ రాజేష్‌కుమార్ రెడ్డిని 30వ సచివాలయానికి, అక్కడ పని చేస్తున్న పద్మజను 39 సచివాలయానికి బదిలీ చేశారు. అదే విధంగా 68వ సచివాలయం కార్యదర్శి రమ్యాయాదవ్‌ను 71కి, అక్కడ పని చేస్తున్న జీ శ్రీవాణిని 71 సచివాలయానికి, 16వ సచివాలయంలో ఉన్న కార్యదర్శి డీ బాబయ్యను 3వ సచివాలయానికి, 18వ సచివాలయ కార్యదర్శి విజయ శ్రీవల్లికను 16వ సచివాలయానికి ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


సీఎం జగన్‌తోనే ముస్లింల సంక్షేమం


బ్రోచర్లు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి, సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందని మేయర్ మహమ్మద్ వసీం సలీం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా గురువారం నవోదయ కాలనీలోని మస్జిద్-ఏ-అనస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ తదితరులతో కలసి వర్షంలోనే మసీదులను సందర్శించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక మసీదులు, దర్గాల అభివృద్ధితో పాటు ముస్లింల సంక్షేమానికి చేపట్టిన పథకాలను వివరించారు. గతంలో వైఎస్సార్, ఇప్పుడు వైఎస్ జగన్ హయాంలో మాత్రమే ముస్లింల కోసం అనేక పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం ముస్లింల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామాంజనేయులు, మసీదు ఇమామ్ నబీరసూల్, ముతవల్లి మాబు, పార్టీ నాయకుడు ముహీబ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు పకడ్బందీ చర్యలు


అనంతపురం క్రైం: డెంగీ నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు హెచ్ఓడీలను ఆదేశించారు. బుధవారం జీజీహెచ్‌లో మెడిసిన్, చిన్నపిల్లల, మైక్రోబయాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, పెథాలజీ విభాగాధిపతులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. గతేడాది ఆస్పత్రిలో నమోదైన డెంగీ, తదితర కేసుల వివరాలపై ఆరా తీశారు. గతేడాదితో పోల్చితే కేసులు పెరగలేదన్నారు. డెంగీ రోగులకు ఉత్తమ సేవందించేందుకు సమష్టిగా పని చేయాలన్నారు. మెడిసిన్‌లో 20, చిన్న పిల్లల వార్డులో 10 ప్రత్యేక పడకలను డెంగీ కేసుల కోసం ఏర్పాటు చేయాలన్నారు.


హెచ్ఓడీలతో సమావేశమైన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు

ప్లేట్‌లెట్స్ సిద్ధం చేసుకోవాలి

డెంగీ, ఇతర విష జ్వరాలతో 20 వేల కంటే తక్కువ ప్లేట్‌లెట్స్ నమోదైన వారికి ప్లేట్‌లెట్స్ అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని రక్తనిధి కేంద్రం వైద్యులను ఆదేశించారు. ప్లేట్‌లెట్స్ కోసం బ్లడ్ క్యాంపులను ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిద్దామన్నారు. డెంగీ, విషజ్వరాల కేసులకు రోజూ ప్లేట్‌లెట్స్ పరీక్ష చేయించాలన్నారు. తక్కువగా నమోదైన వారికి ఎన్ఎస్ 1 ఐజీజీ/ఐజీఎం పరీక్షలు (ఎలిసా) చేయించాలన్నారు. కిట్స్ అందుబాటులో ఉన్నాయా? లేదా అని మైక్రోబయాలజీ హెచ్ఓడీను ఆరా తీయగా 400 వరకూ కిట్లు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షకులు డాక్టర్ శివకుమార్, హెచ్ఓడీలు డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శాంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు


వక్తృత్వ పోటీలను పరిశీలిస్తున్న ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి

అనంతపురం: ఎస్కేయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 28న నిర్వహించనున్నారు. ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ కళాశాల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ప్రొఫెసర్ జి.నరసింహన్, ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శైలజ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు 28న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

భవన నిర్మాణాల్లో వేగం పెంచాలి

బెళుగుప్ప: సచివాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయ భవనాలను త్వరితగతిన పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హనిమరెడ్డిపల్లిలో జరుగుతున్న సచివాలయ భవన నిర్మాణ పనులను ఎంపీడీఓ రామచంద్ర,ఎంఈఓ మల్లారెడ్డితో కలసి పరిశీలించారు. బెళుగుప్పలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. హౌసింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు.